# మధుర భావన - 15

‘ తను వచ్చి ఇంట్లో తోడుగా ఉండాలనుకుంటే, బెట్టు చూపించినట్లు దూరదూరంగా మసలిన వాడు... తను ప్రయాణమయ్యేసరికి బెంగ పడుతున్నాడా...? ఎవరికైనా దాసోహమనిపించగలదని తన అందంమీద ఒక విధమైన నమ్మకం, గర్వం ఉండేది! కానీ... ఇక్కడకు వచ్చాక వంశీ ప్రవర్తన వల్ల ఆ అభిప్రాయం సడలింది! అయితే వంశీ గాంభీర్యం నిజం కాదన్నమాట? పైకి మర్యాదస్థుడిలా గంభీరంగా నటించి, ఇపుడు అసలైన మగవాడిలా నిజ స్వరూపం చూపిస్తున్నాడు కాబోలు! ’

తిలోత్తమ పెదవులపైకి చిన్న విజయదరహాసం వచ్చింది.

వయ్యారంగా వంశీ భుజాలపై చేతులు వేసి ‘‘సరే బావా... నువ్వు ఉండిపోమంటే వెళ్ళగలనా చెప్పు ! కానీ నాకు బోర్ కొట్టకుండా చూసుకోవాలి మరి.. ఇంట్లో వంటాగింటా లాంటివన్నీ బంద్ చేసేసి అలా రోజంతా బయట తిరుగుదామా...?’’ అనడిగింది.

వంశీ చిరునవ్వుతో చూసి ‘‘నువ్వెలా అంటే అలానే చేద్దాం...!’’ అంటూ హుషారుగా లేచి నిలబడ్డాడు.

‘‘ఒక్క అయిదు నిమిషాలు... రెడీ అయివస్తాను..!’’ అంటూ తిలోత్తమ తూనీగలా పరుగుపెట్టేసింది తన గదిలోకి.

పార్వతికి ఇంట్లో వంట చేయాల్సిన అవసరం లేదని రెండు రోజుల తర్వాత మూడో రోజు చెప్పేసరికి పార్వతి ఆశ్చర్యంగా చూసింది తిలోత్తమ వైపు. ‘‘ఏమిటలా చూస్తున్నావు...? చెప్పింది అర్థంకాలేదా...?’’ అంది తిలోత్తమ దురుసుగా.

పార్వతి కొంచెంగా నసుగుతూ అడిగింది. ‘‘పెద్దమ్మగోరి దగ్గరకు పోయొస్తనారామ్మా... రోజు బయటనే తింటే, మీ ఆరోగ్యం సంగతేమిటమ్మా...? నా వంట బావుండట్లేదా...?’’

‘‘మేం అత్తయ్యను చూడటానికి వెళ్తున్నామని నీకెవరు చెప్పారు..? నేను పేషంటును చూసుకోవటానికి వచ్చిన నర్సును కాను! బావకు సరదాగా తోడుగా ఉండటానికి వచ్చానంతే! అయినా ఈ వివరాలన్నీ నీకనవసరం! చెప్పింది చేయటమే నీ పని! ఎదురు ప్రశ్నలు వేయకు! నాకు ఎవరైనా ఎదురు చెబితే కోపం వచ్చేస్తుంది! ఈ ఇంట్లో నువ్వు పనిచేయాలనుకుంటే, నా మాట వినాల్సిందే...! అర్థమైందా...?’’

ఆజ్ఞాపిస్తున్నట్లుగా చెప్పిన తిలోత్తమ మాటలకు పార్వతి మౌనంగా తల ఆడించింది ‘అలాగే అన్నట్లు...!’ అయితే కళ్ళల్లో మాత్రం నిరసనను, అసమ్మతినీ చూపించకుండా ఉండలేకపోయింది!

తిలోత్తమ అది గమనించింది కానీ ఏమనాలో తోచక అక్కడనుండి కోపంగా వెళ్ళిపోయింది. పెళ్ళి జరిగాక వీళ్ళ సంగతి చూడొచ్చులే అనుకుంది. వెళ్తూ వెళ్తూ పార్వతి వైపు ఉరుముతున్నట్లుగా చూసింది.

పార్వతి మాత్రం ఏ మాత్రం భయంలేని దానిలా నిట్టూర్చి గదులు శుభ్రంచేసే పనిలో పడింది.

నాలుగు రోజులు అలా ఏ బాధ్యతలూ లేని వాళ్ళలా, జంట పక్షుల్లా ఎగురుతూ బయట తిరిగినవాళ్ళు ఆ రోజు... అలసిపోయినట్లుగా, కూర్చున్నపుడు వంశీని చూస్తూ తిలోత్తమ అంది.

‘‘బావా... ఇలా సరదాగా నచ్చిన చోటకి వెళ్ళి వస్తూవుంటే... చాలా బావుందికదూ...?’’

చిరునవ్వుతో చూసి ‘అవును’ అన్నట్లుగా తలవూపాడు వంశీ.

తిలోత్తమ హుషారుగా అతని దగ్గరకు వచ్చి ‘‘బావా... నాకో సందేహం...! నువ్వూ, సుమజా కూడా ఇలా సరదాగా తిరిగేవాళ్ళా....?’’ అనడిగింది.

వంశీ నిర్లిప్తంగా నిట్టూర్చాడు.

" అబ్బే లేదు...తనకి లాంటి సరదాలు లేనే లేవు.’’

ఆ మాటలకు ‘‘అవునా...?’’ అంటూ తిలోత్తమ పెద్దగా నవ్వింది.

‘‘అవునూ బావా... బయట హోటళ్ళూ, పార్కులు అంటూ తిరుగుతూవుంటే అంత సరదాగా ఉంటోందా, ఇంటికి రాగానే... ఏమిటో చాలా బోర్ గా అనిపిస్తోంది! ఈ చిన్న ఇంట్లో గుడుగుంచం తిరిగినట్లుగా ఉంటోంది! నాకీ నాలుగురోజులకే ఇలా అనిపిస్తోంటే, అబ్బ...! నువ్వు పుట్టినప్పటినుండీ ఇదే ఇంట్లో ఎలా ఉంటున్నావ్...? తొందరలోనే మనం ఓ పెద్ద ఇల్లు చూసుకుని మారిపోదాం... ఏమంటావ్...?’’

‘‘అంటే... నాలుగురోజులకోసారి ఇల్లు మారాలనే కోరిక కలుగుతుందా...? ’’ ఆశ్చర్యంగా చూసాడు తిలోత్తమ వైపు.

ఒకసారి ఏదో మాటల మధ్య సుమజను తను అడిగాడు ‘నిజంగా... మీ అమ్మగారు చెప్పటం వల్ల కాకుండా, ఈ చిన్న ఇల్లు నీకు నచ్చిందంటావా...?’ అని.

సుమజ చిన్నగా నవ్వి గుసగుసగా చెప్పింది.

‘‘నిజంగా ఇల్లా బాగా పెద్దది అయితే, ఇద్దరం చెరో మూల ఉన్నట్లుగా ఉంటాం! అదే ఇల్లు కొంచెం చిన్నది అయితే... ఇద్దరూ ఎపుడూ ఒకరివెంట మరొకరుగా జంటగా తిరగొచ్చు..! అవును కదూ...?’ అంది.

‘‘ఏమిటి బావా... నేనడిగిందానికి జవాబు చెప్పకుండా అలా ఆలోచనలో పడిపోయావ్...? ఇలా సుమజ నిన్నెపుడూ అడగలేదేమో కదూ...?’’ అంటూ తిలోత్తమ రెట్టించేసరికి వంశీ ఆలోచనలనుండి ఉలిక్కిపడి బయటకొచ్చాడు.

వంశీ నిట్టూరుస్తూ అన్నాడు “ చెప్పానుగా, తన అభిరుచులు, ఇష్టాలు అన్నీ వేరే అని! నీలా హుషారుగా ఉండటం....ఉంచటం తనకి తెలియదు..పాతకాలం మనిషి. నీ పరిచయం తర్వాత నాకూ మనిద్దరమే సరిజోడీ అనిపిస్తోంది.. నువ్వెలా అంటే అలాగే చేద్దాంలే! చూద్దాం, మంచి ఇల్లుకొంచెం పెద్దది దొరికితే తీసుకుందాంలే!’’

ఆ మాటలకు అతిశయంతో పొంగిపోతూ ‘‘ప్రయత్నం చేస్తే... ఎందుకు దొరకదూ...?’’ అంది తిలోత్తమ.

* * *

ఆ తర్వాత రెండు రోజులకే తిలోత్తమ వంశీని అడిగింది.

‘‘ఇల్లు ఏదైనా పెద్దది దొరికిందా బావా...?’’ అని.

వంశీ ఆశ్చర్యంగా చూస్తూ ‘‘ఇంత తొందరగానా...?’’ అన్నాడు.

‘‘అసలు నువ్వేమైనా చూశావా...? నాకు చూపించనే లేదూ...?’’

‘‘అవును... అపుడే అనుకోలేదు... అందుకే ఆ ప్రయత్నమే చేయలేదు...!’’ అన్నాడు.

‘‘మనం పెద్ద ఇల్లొకటి చూసుకుని, పెళ్ళి చేసుకుని అత్తయ్యను అక్కడకు తీసుకు వచ్చేస్తే... అపుడత్తయ్య ఆరోగ్యం బాగుపడే అవకాశం ఉండొచ్చని చెప్పాగా...?’’

తిలోత్తమ మాటలకు వంశీ చిరునవ్వుతో చూసి ''నేనూ చెప్పాగా, అమ్మ ఆరోగ్యం బాగు పడ్డాకనే అవన్నీ అని...!'' అన్నాడు.

" అంటే... నేను చెప్తున్నా కూడా వినవా...?'' సూటిగా చూస్తూ ప్రశ్నించింది తిలోత్తమ.

''నా మనసులో ఒక ఆలోచన ఉంది. అదీ ప్రయత్నించి చూడాలనే ఉద్దేశ్యం ఉంది!''

''ఏమిటో అది...?''

తిలోత్తమ ప్రశ్నకు వంశీ సరదాగా నవ్వేస్తూ " అదేమిటో ఇపుడే చెప్పకూడదు! వెండితెరపై వేచి చూడాల్సిందే...!'' అన్నాడు.

''ఈ తమాషా కబుర్లకేంగానీ అదేమిటో చెప్పు ముందు...!'' మాటల్లోనే తిలోత్తమ గారాం చూపించింది.

''తమాషా కాదు. ఖచ్చితంగా చెబుతున్నా!'' అన్నాడు వంశీ.

''ఏమిటో...!'' అంటూ నిట్టూర్చిన తిలోత్తమ ''మీ అందరి మధ్యా నేను నలిగిపోతున్నాను!'' అంది.

వంశీ కళ్ళు పెద్దవి చేసి ఆశ్చర్యంగా చూస్తూ ''నువ్వు... నలిగిపోతున్నావా...? అందరూ... అంటే... ఎవరని నీ ఉద్దేశ్యం...?'' అనడిగాడు తిలోత్తమని.

ఆమె మళ్ళీ నిట్టూర్చింది. ''అటేమో... మా వదిన... ఇటేమో నువ్వు...!''

''మా అనూష ఏమంటోంది...? నేనేం నీ మాటను కాదంటున్నానూ...? రోజు నువ్వు చెప్పినట్టే నీ వెంటే తిరుగుతున్నా కదా...?'' తగ్గుతూ అన్నాడు.

''అది మాత్రమే సరిపోతుందా... పెళ్ళి అనగానే... ముందు మీ అమ్మ ఆరోగ్యం ముఖ్యం అంటావు! అటేమో మా వదినకు ఆ స్థలం కావాలని గోల! నాకేమో...'' అంటూ మాటలు ఆపేసి ఫక్కున నవ్వేసింది.

వంశీ ఆసక్తిగా చూసి ''ఆపేశావేం...? చెప్పూ... నీకేమిటీ?'' అనడిగాడు.

తిలోత్తమ కొంచెంగా తలవంచుకుని ముసిముసి నవ్వుతో చెప్పింది ''నాది పెళ్ళిగోల... !''

వంశీ కూడా సరదాగా నవ్వేసి ''నీ సంగతి సరే, మా అనూషకు ఇంకా ఆ స్థలం మీద ఆశ ఉందా? '' అనడిగాడు.

'' అదేమిటి బావా అలా అంటున్నావు? మా వదిన అందుకేగా నన్నిక్కడకు పంపిందీ... రోజూ అడుగుతూనే వుంటుంది 'పెళ్ళికి దారితీసేంత ప్రేమ వ్యవహారం నడుస్తోందా' అని! అందాల రాకుమారి లాంటి నాకు రాకుమారుడు లాంటి తన అన్నయ్యతో పెళ్ళికుదిర్చినందుకు గాను. తనకి పెళ్ళికానుకగా ఆ స్థలం రాయించే బాధ్యత నాదేనని హెచ్చరించింది కూడా!'' అంటూ తిలోత్తమ చిన్నగా నవ్వింది.

ఒక క్షణం ఆగి మళ్ళీ చెప్పింది తిలోత్తమ. ''అయినా  బావా... నువ్వేం కంగారు పడకు. నేను మరీ అంత తెలివితక్కువదాన్నికాదు! ఆ స్థలం తనకి రాయించినా గానీ, నేనూ ఒక కండీషను పెడతాను. వాళ్ళు కట్టుకున్న ఇంటిపై రెండు ఫ్లోర్ లు మనమూ వేసుకుంటామని. అంతా వాళ్ళకే ధారాదత్తం చేసే ఉద్దేశ్యం నాకూ లేదు!''

వంశీ విస్తుపోయినట్లు చూశాడు తిలోత్తమ వైపు. ''దేనికంత ఆశ్చర్యం, ఆలోచన...?'' అడిగింది వంశీని.

తిలోత్తమ ప్రశ్నకు వంశీ " అందరూ ఎంత బాగా ఆలోచిస్తున్నారా అని!'' అంటూ జవాబిచ్చాడు.

''మరి...? ఎవరి స్వార్థం వారికుండదా...?''

ఏదో ఆలోచిస్తూ అవునన్నట్లు తలవూపిన వంశీతో తిలోత్తమ చెప్పింది.

''బావా... నీకు చెప్పటం మర్చిపోయా... రేపు సుమజ వాళ్ళమ్మగారితో కలిసి అదే... వాళ్ళ బంధువులో, స్నేహితులో ఈ ఊళ్ళో ఉన్నారుగా, వాళ్ళింటికి వస్తోందట! ముందుగా మనింటికీ ఇక్కడికి చూసి పోవటానికి వస్తానంది. ఫోన్ చేసి చెప్పిందిలే నేను ఫోను తీసి 'నువ్వు బయటకు వెళ్ళావని చెబితే, నీకీ మాట చెప్పమంది'. ఇప్పుడు నాకూ ఒక ఆలోచన వచ్చింది. దాన్ని రేపే అమలు చేసి చూస్తా!''

''ఏమిటో ఆ ఆలోచన...?'' వంశీ ఆసక్తిగా అడిగాడు. తిలోత్తమ నవ్వింది.

‘‘నేను మాత్రం ఎందుకు చెబుతాను.. వెండి తెరపై వేచి చూడాల్సిందే!’’ అంది.

" గడుసుదానివే " వంశీ అనగానే, ఇద్దరూ మళ్ళీ నవ్వుకున్నారు.

* * *

మరునాడు....

తిలోత్తమ, వంశీ ఇద్దరూ ముందుగదిలో కూర్చుని కాఫీ తాగుతున్నవేళ సుమజ వచ్చిందక్కడికి.

చేతిలోని కాఫీ కప్పు పక్కన పెట్టేసి, తిలోత్తమ తన మీదికి ఒంగి పెద్దగా నవ్వుతూంటే... హఠాత్తుగా ఆమె ఎందుకంతగా నవ్వుతోందో అర్థంకాని వంశీ కొంచెం బిత్తరపోతూ చూశాడు.

గేటువైపు చూపులతోనే చూపించి తిలోత్తమ ‘‘నీ మాజీ వస్తోంది’’ అంది. గుమ్మం దగ్గిర సంకోచంగా నిలబడిన సుమజ తో తిలోత్తమ ‘‘రా సుమజా... వచ్చి కూర్చో...’’ అంది.

సుమజ లోపలకు రాగానే వంశీతో ‘‘బావా... అత్తయ్యను చూడటానికేగా సుమజ వచ్చింది. అందరం వెల్దాం... నువ్వు లోపలకు వెళ్ళి రెడీ అవ్వు. ఈ లోపున నేను మాట్లాడుతూ ఉంటా...’’ అంది.

‘‘నీతో మీ అమ్మగారూ వచ్చారని అన్నావుగా, ఆవిడ రాలేదేం...?’’ తిలోత్తమ ప్రశ్నకి సుమజ మెల్లగా జవాబిచ్చింది.

‘‘అమ్మ... అక్కడికే... అంటే హాస్పటల్ కే వస్తానని చెప్పింది. నేనీలోపుగా ఇటు వచ్చాను...!’’

తిలోత్తమ వంశీ వైపు చూడగానే...అతను లేచి నిలబడి ‘‘సరే... నేను అయిదు నిముషాల్లో వస్తాను...’’ అంటూ లోపలకు వెళ్ళిపోయాడు.

చెప్పినట్లుగానే కాసేపటిలోనే రెడీ అయి అక్కడికి వంశీ వచ్చాడు.

అతను వచ్చీ రాగానే... సుమజ లేచి నిలబడి ఎర్రబడ్డ మొహంతో అతనితో ‘‘మీ మనసు మారితే, ఆ విషయం తెలియజేయటానికి మీరు అంత సంకోచించాల్సిన అవసరం లేదు! నేనేం గొడవ పెట్టుకోను... ముందుగానే మీ ప్రవృత్తి బయటపెట్టినందుకు సంతోషమే...! మీ ఇష్టాన్ని నేనూ గౌరవిస్తాను...!’’ అని చెప్పి ఒక క్షణం ఆగి ‘‘మా అమ్మతో కలిసి అత్తయ్యను... అదే మీ అమ్మగారిని చూసి అటే వెళ్ళిపోతాం...!’’ అంటూ వంశీ, తిలోత్తమల వైపు చూసి బయటకు చకచకా వెళ్ళిపోయింది.

ఏమీ అర్థంకాని వంశీ తిలోత్తమ వైపు ‘ఏమిటిది’ అన్నట్లుగా చూశాడు. తిలోత్తమ నిట్టూర్చింది.

‘‘బావా... నిన్ననే నీకు చెప్పానుగా, ఆ ఆలోచన ఇదే...! సుమజ నీతో తన పెళ్ళి జరుగుతుందని అనుకుంటోందేమోనని... ఆ విషయం మర్చిపొమ్మని చెప్పి, మన పెళ్ళి జరగబోతోందనే విషయమూ చెప్పాను. మరి... నేనూ... నా దారిలో... ఏ విధమైన అడ్డంకులూ లేకుండా చేసుకోవాలిగా... ముందుగా తనని

అనుకుని ఇపుడు ఆ అభిప్రాయం మార్చుకున్నందుకు ఏమైనా గొడవ చేస్తుందేమోనని కొంచెం సందేహించాలే!''

వంశీ నిట్టూర్చాడు. ''తను అలాంటి గొడవేం చేయకుండా హుందాగా తప్పుకుంటానని అంటుందని నాకు తెలుసు! అయితే, తనను కాదనుకున్న వాళ్ళదే దురదృష్టం గానీ, తనది కాదు...''

వంశీ మాటలు వింటూనే ''ఏమిటీ...?'' అంటూ తిలోత్తమ కోపంగా చూస్తూ మాట సాగదీసింది.

వెంటనే వంశీ... ''అలా అని తను అనుకుంటుందని నేను చెప్పబోతున్నానులే డార్లింగ్....!'' అనగానే ''నిజమా...?!'' అంటూ తిలోత్తమ మెలికలు తిరిగిపోయింది వయ్యారంగా!

''బావా... నువ్వలా నన్ను పిలిస్తే... అబ్బ... ఎంత బావుందో...!'' అంది చూపుల్లోనే మురిపాన్ని కుమ్మరించేస్తూ!

''మనకి ఇష్టమైన వాళ్ళని అలాగే కదా పిలవాలి ! నువ్వు... నీకు తెలియకుండానే నాకెంతో సహకరిస్తూ, మంచి చేస్తున్నావ్ గా, మరి... నువ్వంటే నాకిష్టం ఏర్పడటం సహజమేగా?'' వంశీ మాటలకు తిలోత్తమ ఆశ్చర్యంగా చూసింది.

''ఏమిటి బావా... నేను నీకేం సహాయం చేస్తున్నానూ...?''

‘‘చెప్పానుగా, నీకే తెలియకుండా చేస్తున్నావ్ అని! అదేమిటో వివరం .. ఇపుడు కాదులే, నీకే తెలుస్తుంది, సమయం వచ్చినపుడు...’’ అని వంశీ అనగానే తిలోత్తమ పెదవులపైకి చిరునవ్వు వచ్చింది.

‘అవునుకదా... ఒంటరిగా వుంటున్నవాడికి తోడునీడగా ఉండి సరదాగా కాలక్షేపం కలిగించటం అంటే... సహాయం చేస్తున్నట్లేగా’ అనుకుంది తిలోత్తమ.

* * *